# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 05-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో జనాభా వృద్ధిరేటును పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

2. తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం రూపొందించిన మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ రోజు ప్రారంభిస్తారు.

3. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ధాన్యం కొనుగోలు చేయని రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.

4. తెలంగాణలో కొత్తగా మరో రెండు ఆర్టీసీ బస్సు డిపోలను ఏర్పాటు చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు..

5. విజయవాడలో రేపటి నుంచి మూడు రోజులపాటు 'కృష్ణవేణి సంగీత నీరాజనం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

==========================

రాష్ట్రంలో జనాభా వృద్ధిరేటును పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, జనాభా వృద్ధిరేటు వంటి అంశాలపై గుంటూరుజిల్లా ఉండవల్లిలో ముఖ్యమంత్రి నిన్న ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు అత్యల్పంగా ఉండటం, రోజురోజుకీ వృద్ధుల సంఖ్య పెరుగుతూ, యువత సంఖ్య తగ్గిపోతుందని గణాంకాలు చూపుతున్నాయని అన్నారు జనాభా పెంచేందుకు జపాన్, చైనా, ఆస్ట్రేలియా వంటి దేశాలు అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, కుటుంబ సభ్యులకు తగ్గట్టు ప్రభుత్వ పథకాలు అందించడంపై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

--------------------------

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం రూపొందించిన మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ రోజు ప్రారంభిస్తారని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రేపటి నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని రాజకీయ పార్టీలు, ప్రాంతాలు అనే భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందిస్తామని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇళ్ల పంపిణీ పూర్తయ్యే వరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. గ్రామీణ

ప్రాంతాల్లో ప్రజలకు వీలుగా ఉండేలా  యాప్‌ను తెలుగులోనూ రూపొందించామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన  ఏడాది కాలంలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పెద్దపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలను, సీఎం కప్ ట్రోఫీని ఆవిష్కరించారు.అనంతరం నిర్వహించిన యువ వికాసం సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ...

వాయిస్... 32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్  ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయని రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.  కృష్ణా జిల్లా అవనిగడ్డ, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో మంత్రి నిన్న  పర్యటించి ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,  ధాన్యంలో తేమ 25 శాతం వరకూ ఉన్నా  కొనుగోలు చేస్తామని అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మిల్లర్లు, దళారులు ధర తగ్గిస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు.  రైతులి  వాట్సప్ సేవలు వినియోగించుకోవాలని.. 7337359375 నంబరుకు హాయ్ అని మెస్సేజ్  చేస్తే అధికారులే వచ్చి ధాన్యం కొనుగోలు చేసే సౌకర్యం కల్పించినట్లు మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వెనుకడిన కులాలు-బీసీల సంక్షేమానికి రాష్ట్ర  బడ్జెట్‌లో 39 వేల 7 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం కేటాయించిందని ఆ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ,  బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయంఉపాధి పథకాల కింద 1.33 లక్షల మందికి ఒక వెయ్యి 9 వందల 77.53 కోట్ల రాయితీ రుణాలను అందజేయనున్నట్లు వెల్లడించారు.  బీసీల కోసం  26 జిల్లాకేంద్రాల్లో ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రాలను ప్రారంభించామని, త్వరలో సివిల్ సర్వీస్ శిక్షణ కేంద్రాలను కూడా ప్రారంభిస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..33  సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాభివృద్ధి సంస్థల  పరిధిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన భూమిని గుర్తించాలని పురపాలక మంత్రి పి. నారాయణ అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి  కర్నూలు, కడప, అనంతపురం-హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థల అధికారులు, ఛైర్మన్లతో మంత్రి దృశ్య మాధ్యమం ద్వారా  నిన్న సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సంస్థల ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణం, లేఅవుట్లను అభివృద్ధి చేసి ఆర్థికంగా పురోగతి సాధించాలన్నారు. పట్టణ ప్రాంతాలకు సమీపంలో మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఇళ్లను నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

---------------------------

తెలంగాణలో కొత్తగా మరో రెండు ఆర్టీసీ బస్సు డిపోలను ఏర్పాటు చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.. హైదరాబాద్‌లో మంత్రి నిన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ –టిజి యస్ఆర్టీసీలో అనేక సంస్కరణలు చేపట్టి కార్మిక సంక్షేమం, ప్రజల సౌకర్యం కోసం కృషి చేస్తున్నామన్నారు. కొత్తగా జిల్లా కేంద్రాలుగా ఉన్న పెద్దపల్లి, ములుగు జిల్లాలోని ఏటూరు నాగారంలో రెండు ఆర్టీసీ బస్సు డిపోలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ డిపోల ద్వారా ఆ ప్రాంత ప్రయాణికులతో పాటు మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రయాణికులకు రవాణా సౌకర్యాన్ని అందిస్తామన్నారు. త్వరలోనే బస్సు డిపోల నిర్మాణం ప్రారంభి స్తున్నట్లు మంత్రి తెలియజేశారు.

---------------------------

కేంద్ర, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రేపటి నుంచి మూడు రోజులపాటు విజయవాడలో కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. విజయవాడలో నిన్న మంత్రి మాట్లాడుతూ దేశంలో ఉన్న వివిధ సాంస్కృతిక కళలను తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంతోపాటు ఆంధ్రా సాంస్కృతిక కళారూపాలకు తిరిగి పూర్వ వైభవం తీసుకోస్తామని మంత్రి వివరిస్తూ,

వాయిస్ .. 35 సెకన్లు

---------------------------

దేశంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల్లోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి 3295.76 కోట్ల రూపాయలతో 40 ప్రాజెక్టులను ఆమోదించింది. దేశవ్యాప్తంగా పర్యాటకుల సమతుల్యతను ప్రోత్సహించడంతో పాటు, స్థానికులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను ఆమోదించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాలకు 4 పర్యాటక ప్రాజెక్టులను కేంద్ర పర్యాటక శాఖ మంజూరు చేసింది. ఆంధ్రప్రదేశ్ లోని వైయస్సార్ జిల్లా గండికోట, తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం హేవ్‌లాక్ బ్రిడ్జ్, పుష్కర్ ఘాట్ లను ఎంపిక చేసింది. అలాగే తెలంగాణలోని ములుగు జిల్లా రామప్ప పర్యాటక ప్రాంతం,నాగర్ కర్నూల్ జిల్లాలోని సోమశిల నల్లమల ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు కేంద్ర పర్యాటక శాఖ తెలిపింది.

---------------------------

తెలంగాణలో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్ ను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యాటక అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అందించడంతో పాటు రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని చెప్పారు. హుస్సేన్ సాగర్‌ను మంచి నీటి సరస్సుగా మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు.

=====================